కొల్చారం: పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులను నిర్బంధించిన ఎస్సై


చేగుంట: పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నేతలు

చిన్నశంకరంపేట: బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

అక్రమ అరెస్టులు అప్రజాస్వామికం

- ముందస్తు అరెస్టులు హేయమైన చర్య
- కాంగ్రెస్ నాయకులు గుండాయిజం చేస్తే ఊరుకోం
- ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి ఇంటిపై దాడి దారుణం
- బీఆర్ఎస్ మెదక్ జిల్లా నాయకులు

మెదక్ మున్సిపాలిటీ/నర్సాపూర్/పెద్దశంకరంపేట/ రేగోడ్/ చేగుంట/నిజాంపేట/కొల్చారం/చిలిపిచెడ్, సెప్టెంబర్ 13: శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ తన అనుచరులతో కలిసి బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటిపై కాంగ్రెస్ గుండాలతో దాడి చేయడం అప్రజాస్వామ్యమని బీఆర్ఎస్ నాయకులు ధ్వజమెత్తారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పిలుపు మేరకు చేపట్టిన కార్యక్రమానికి అడ్డుకునే చర్యలో భాగంగా శుక్రవారం ముందస్తుగా ఎక్కడికక్కడ బీఆర్ఎస్ శ్రేణులను పోలీసులు ముందస్తుగా అరెస్టులు చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ గుండాలు బీఆర్ఎస్ శ్రేణులపై దాడి చేయడం పిరికిపంద చర్యని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ నాయకుల నియంతృత్వ పాలనను తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని, సమయం వచ్చినప్పుడు సరైన గుణపాఠం చెబుతారన్నారు. దీంతో ఆగ్రహించిన నాయకులు పోలీస్‌స్టేషన్‌లో నిరసన చేపట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేస్తూ పోలీసుల చర్యను తప్పుబట్టారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిపక్ష నాయకుల ఇండ్లపై దాడులు చేయిస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇలాంటి దాడులు ఎప్పుడూ జరగలేదన్నారు. దాడుల సంస్కృతి మంచిది కాదన్నారు.

చిలిపిచెడ్ పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

పెద్దశంకరంపేట పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

అల్లాదుర్గంలో బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేసిన పోలీసులు

నిజాంపేట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్ట్

రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నాయకులు

నర్సాపూర్ పోలీస్‌స్టేషన్‌లో నినాదాలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

రేగోడ్: బీఆర్ఎస్ నాయకులను హౌస్ అరెస్ట్ చేసిన పోలీసులు

వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు

తూప్రాన్: బీఆర్ఎస్ నాయకులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

శివ్వంపేట: మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ మహేశ్‌గుప్తా, నాయకులు

అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే సహించం


నర్సాపూర్‌లో సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, సెప్టెంబర్ 13: అభివృద్ధి కార్యక్రమాలను కాంగ్రెస్ నాయకులు అడ్డుకుంటే సహించేది లేదని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి హెచ్చరించారు. శుక్రవారం నర్సాపూర్‌లోని క్యాంప్ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కరించడానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. అధికార పార్టీ నాయకులు ఎన్ని అడ్డంకులు కలిగించినా ప్రజా సమస్యలపై పోరాడతానన్నారు. పర్కిబండ, పోతారం గ్రామాల్లో 16 సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఆపించారని ఆరోపించారు. నర్సాపూర్ నియోజకవర్గానికి 613 మందికి రూ.కోటి 60 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులు వచ్చాయన్నారు. ఆరు గ్యారెంటీలు, 420 హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందన్నారు. వీటిని ప్రశ్నించినందుకు ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులపై దాడులు చేసి, కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావుకు గాయమైందని పరామర్శించడానికి వెళితే అరెస్ట్ చేశారని, ఇదెక్కడి న్యాయమని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దీన్, వైస్ ఎంపీపీ వెంకటనర్సింగారావు, ఆత్మకమిటీ మాజీ చైర్మన్ శివకుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ ఆర్ఎస్ ప్రక్రియ వేగవంతం చేయాలి

- అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

మెదక్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై ఇరిగేషన్ ఏఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను సమర్థవంతంగా పరిష్కరించాలన్నారు. ఎల్ఆర్ఎస్ కింద మొత్తం ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, మున్సిపాలిటీ, గ్రామ పంచాయతీల వారీగా దరఖాస్తుల వర్గీకరణపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ, పంచాయతీరాజ్, ఇరిగేషన్ సంబంధిత శాఖల సమన్వయంతో క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం త్వరలో రెండో విడత ప్రజా పాలన ప్రారంభించే అవకాశం ఉన్నదని, ప్రభుత్వ ఆదేశాలు రాగానే ఈ ప్రక్రియ కొనసాగించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఈనెల 17న ప్రజాపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ పతాకావిష్కరణ నిర్వహించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈవో ఎల్లయ్య, డీపీవో యాదయ్య, టౌన్ అండ్ కంట్రీ ప్లానింగ్ ఇన్‌చార్జి అధికారి కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే గుర్తింపు లభిస్తుంది

చిలిపిచెడ్: చిట్కుల్‌లో ఖోఖో ఆడుతున్న విద్యార్థులు

రామాయంపేట: వాలీబాల్ ఆడుతున్న క్రీడాకారులు

చిలిపిచెడ్, సెప్టెంబర్ 13: విద్యార్థులు క్రీడల్లో జాతీయ స్థాయిలో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని చిట్కుల్ పీఈటీ సుజాత తెలిపారు. శుక్రవారం మండలంలోని చిట్కుల్ చర్చి మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలను ప్రారంభించారు. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్ పోటీలను మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు తెలిపారు.

రామాయంపేటలో మండల స్థాయి క్రీడలు

రామాయంపేట, సెప్టెంబర్ 13: పట్టణంలో మండలస్థాయి క్రీడలు జోరుగా కొనసాగుతున్నాయి. స్థానిక ప్రభుత్వ కళాశాల గ్రౌండ్‌లో జరుగుతున్న ఆటలపోటీల్లో వాలీబాల్‌లో 300మంది జూనియర్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నట్లు ఎస్‌జీఎఫ్ కన్వీనర్ నాగరాజు తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ పోటీలు మరో రోజు కొనసాగుతాయన్నారు. ప్రతిభ కనబర్చిన టీమ్‌లకు బహుమతులు అందజేస్తామన్నారు. పీడీలు నాగచందర్, కిరణ్, సిద్ధరాములు, యాదగిరి, శోభ, గీత, విజయలక్ష్మి, లత పాల్గొన్నారు.

ఓటరు జాబితాలో తప్పొప్పులను చూసుకోవాలి

చిన్నశంకరంపేట, సెప్టెంబర్13: చిన్నశంకరంపేట ప్రజల ఓటరు జాబితాను వార్డుల వారీగా పంచాయతీ కార్యాలయంలో అందుబాటులో ఉంచామని ఈవో సంతోష్ శుక్రవారం తెలిపారు. ప్రజాప్రతినిధులు, పట్టణ వాసులు జాబితాను సరిచూసుకుని తప్పులు ఉన్నట్లయితే నేటి నుంచి 21వ తేదీ వరకు లికితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

చిలిపిచెడ్‌లో..

చిలిపిచెడ్, సెప్టెంబర్ 13: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో వార్డుల వారీగా ఓటరు జాబితాలు పెట్టారని, అందులో తప్పొప్పులు సరి చూసుకోవాలని ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. ఓటరు జాబితాలో పేర్లు తప్పుగా ఉన్నా, నమోదు కాకపోయినా వెంటనే గ్రామ కార్యదర్శికి, బీఎల్‌వోలకు తెలుపాలన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సాపూర్/చిలిపిచెడ్/చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 13: గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు సూచించారు. సీజనల్ వ్యాధులపై జాగ్రత్తలు తీసుకోవాలని, ఇంటి పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని చిలిపిచెడ్ పంచాయతీ కార్యదర్శి కృష్ణ తెలిపారు. శుక్రవారం నర్సాపూర్ మండలంలోని పెద్ద చింతకుంట, రుస్తుంపేట్ గ్రామాలను సందర్శించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేక అధికారి నీలిమ సూచించారు. చిన్నశంకరంపేటలో డ్రైడేలో పాల్గొని ఆశ, అంగన్ వాడీలకు పలు సూచనలు చేశారు.

ఫ్లెమింగ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి

శివ్వంపేట, సెప్టెంబర్ 13: విషజలాలు వదులుతున్న ఫ్లెమింగ్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకుడు నల్ల రవిగౌడ్ అన్నారు. శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ షఫీయోద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. పరిసర ప్రాంత రైతుల పొలాలకు రసాయన జలాలు వదలడంతో పంటలు నాశనమవుతున్నాయన్నారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని పరిశ్రమపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయనతో నాయకులు హరిగౌడ్, రైతులు ఉన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అంగన్‌వాడీల సేవలు వినియోగించుకోవాలి

మెదక్ రూరల్, సెప్టెంబర్ 13: జిల్లా పాతూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల సేవలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమ తెలిపారు. శుక్రవారం మండలంలోని మక్త భూపతిపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని అందజేస్తున్నదన్నారు. చిన్నారులకు అక్షరాభ్యాసం, అన్నప్రాసన చేశారు.

అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సూపర్‌వైజర్ రమ, అంగన్‌వాడీ టీచర్లు

ఆర్థిక ఇబ్బందులతో రైతు ఆత్మహత్య

భిక్షపతి (ఫైల్)

చేగుంట, సెప్టెంబర్13: ఆర్థిక ఇబ్బందులతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన చేగుంట మండలం పోతాన్‌పల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. బాధిత కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అరికెల భిక్షపతి(46)కి ఆర్థిక ఇబ్బందులు అధికమయ్యాయి. దీంతో ఇంట్లో వారితో గొడవపడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు చేగుంట పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీతారాం ఏచూరికి ఘన నివాళి

నర్సాపూర్, సెప్టెంబర్ 13: అనారోగ్యంతో మృతి చెందిన సీపీఎం జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరికి నర్సాపూర్‌లోని సీపీఎం కార్యాలయంలో డివిజన్ కార్యదర్శి కడారి నాగరాజు ఆధ్వర్యంలో శుక్రవారం నివాళులర్పించారు. నాయకులు భూషణం, నర్సింహులు, శేఖర్, చంద్రయ్య, శంకర్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

KIDNY STONES

★ మూత్ర పిండాల్లో రాళ్ల సమస్యకు ఆపరేషన్ లేని హోమియో పరిష్కారం, 47 సం॥ అనుభవంతో 100% గ్యారంటీ. జయసూర్య హోమియో క్లినిక్ A Centre for Kidny Stones, Opp: రైల్వే డిగ్రీ కాలేజ్, మెట్రో పిల్లర్ నెం. 1058, తార్నాక, సికింద్రాబాద్. ఫోన్: 9866007924, 9550336677, 040-27000580.
NT-332617

BUSINESS OFFER

★ SSS GRAPHICS Wanted District Wise Franchisees & also Distributors for 2025 Diaries and Calendars. Cont: 8639471849, 8790523529, Hyderabad.
NT-331739

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఆయిల్ పామ్ సాగులో అగ్రస్థానంలో నిలవాలి

జిల్లాలో 2 వేల ఎకరాలు సాగుకు ప్రణాళికలు సిద్ధం: కలెక్టర్ రాహుల్‌రాజ్

నర్సిఖేడ్‌లో మొక్క నాటుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, సెప్టెంబర్ 13 (నమస్తే తెలంగాణ): ఆయిల్ పామ్ సాగులో జిల్లాను అగ్రస్థానంలో నిలవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మెదక్‌లోని నర్సిఖేడ్ ఏరియా జిల్లా ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ మెగా ప్లాంటేషన్‌లో కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ఆయిల్ పామ్ తోటలకు అనుకూలంగా ఉన్నదని ఆయిల్ పామ్ పరిశోధనా సంస్థ పెదవేరి మండలం ఏలూరు జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్రవేత్తలు సందర్శించి ధ్రువీకరించారన్నారు. 2024-25కు జిల్లాలో 2 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ తోటల సాగుకు ప్రణాళికలు చేసుకున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 1176 ఎకరాల్లో సాగుకు రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వారు మొక్కలు ఉత్పత్తి చేసేందుకు చెల్మెడ గ్రామం నిజాంపేట మండలంలో 43 ఎకరాల్లో నర్సరీని ఏర్పాటుచేశారన్నారు. జిల్లాలో 2023- 24లో 74 మంది రైతులు 336 ఎకరాల్లో సాగు చేశారన్నారు. ఎకరానికి ఆయిల్ పామ్ మొక్కలకు 9,650 మొదటి సంవత్సరం సబ్సిడీ ఇవ్వడంతో పాటు, అంతర్ పంటల సాగుకు మొదటి నాలుగేండ్లకు రూ.26,450 సబ్సిడీ అందిస్తారన్నారు. వివరాల కోసం ఉద్యానవన అధికారి మెదక్ (8977714423), నర్సాపూర్(8977714422) సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యానవన, పట్టు పరిశ్రమ అధికారి ప్రతాప్‌సింగ్, అధికారులు రచన, సంతోష్ కుమార్, ఏవవో శ్రీనివాస్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజశేఖర్, లివింగ్ ఫుడ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ మేనేజర్ డాక్టర్ కృష్ణ పాల్గొన్నారు.

పరిసరాలు శుభ్రంగా ఉండాలి

రామాయంపేట, సెప్టెంబర్ 13: పరిసరాలు శుభ్రంగా ఉంటేనే దోమలు దరికి చేరవని కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. డ్రైడే సందర్భంగా మండలంలోని అక్కన్నపేటలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. గ్రామంలో వీధివీధినా తిరుగుతూ పరిసరాలను పరిశీలించారు. మినీ ట్యాంకులు, మురుగు కాల్వలను సందర్శించి పారిశుద్ధ్య కార్మికులకు, ప్రభుత్వ సిబ్బందికి పలు సూచనలు చేశారు. డయేరియా, పైలేరియా, అతిసార, మలేరియా వ్యాధులపై అవగాహన కల్పించాలని తెలిపారు. వారితో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, తహసీల్దార్ రజినీకుమారి, ఎంపీడీవో షాజులుద్దీన్ ఉన్నారు.

రామాయంపేటలో మినీ ట్యాంకును పరిశీలిస్తున్న కలెక్టర్

ప్రాణం తీసిన భూవివాదం

- సెల్ఫీ వీడియోలో ఇద్దరి పేర్లు తెలిపిన మృతుడు

రహదారిపై రాస్తారోకో చేస్తున్న మృతుడి బంధువులు ఇన్‌సెట్‌లో స్వామి(ఫైల్)

రామాయంపేట, సెప్టెంబర్ 13: భూ వివాదంలో ఓ రైతు పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తోబుట్టువు మరొకరితో కలిసి బెదిరించడంతో మనస్తాపానికి గురై తన పొల్లిఫాంలోనే ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన రామాయంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సుతారిపల్లిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. పున్న స్వామి (54) వ్యవసాయం చేసుకుంటూ, కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలోనే తోబుట్టువుకు తనతో సమానంగా ఆస్తి పంపకాలు చేశాడు. ఆస్తి అంతా తమకే దక్కాలని తన కూతురిని సోదరి పెంచుకున్న వ్యక్తికి ఇచ్చి పెళ్లి చేశాడు. ఇంత చేసినా సోదరి తన అన్నపై కక్ష పెంచుకున్నది. సోదరి పుష్ప తమ ఆస్తి తన కూతురుకు చెందాలని గొడవలు పెడుతున్నది. పెంపుడు కొడుకుకు ఇవ్వనని మొండికేసింది. పెద్ద మనుషుల ముందు పంచాయితీ కూడా చేసింది. పుష్ప ఇద్దరు రాజకీయ నాయకులతో మృతుడు స్వామిపై కొన్ని రోజులుగా బెదిరింపులకు పాల్పడుతున్నది. దీంతో మృతుడు పురుగు మందు తాగి సెల్ఫీ వీడియోలో విషయం బయటపెట్టాడు. చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో స్వామి మృతి చెందాడు. మృతదేహాన్ని రామాయంపేటకు తరలిస్తుండగా జాతీయ రహదారిపై అంబులెన్సును బంధువులు అడ్డుకున్నారు. ఐదు గంటల పాటు రోడ్డుపై రాస్తారోకో చేశారు. సర్కిల్ పరిధిలోని నాలుగు పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, ఏఎస్సైలు, సిబ్బంది చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు. సీఐ వెంకటరాజగౌడ్ మృతుడి బంధువులను సముదాయించి మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ నాయకుడు దేవేందర్‌రెడ్డి, మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి పరామర్శించారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే

చేగుంట, సెప్టెంబర్ 13: నార్సింగిలో ఆరుగురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులను మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు శుక్రవారం అందజేశారు.

చిన్నశంకరంపేటలో

చిన్నశంకరంపేట,సెప్టెంబర్13: చిన్నశంరంపేటలోని రైతువేదిక భవనంలో మండలంలోని 49 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ రూ.20 లక్షల చెక్కులను ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అందించారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని సాధించాలి

విద్యార్థినికి చెక్‌ను అందజేస్తున్న డీఐఈవో మాధవి

రామాయంపేట, సెప్టెంబర్ 13: విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదివి ఉన్నత లక్ష్యాన్ని సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి మాధవి, సీఐ వెంకటరాజగౌడ్ అన్నారు. శుక్రవారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. కార్యక్రమంలో రామాయంపేట, చేగుంట ప్రిన్సిపాళ్లు హిమజ్యోతి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గురుకులంలో ఖాళీల భర్తీకి దరఖాస్తులు

మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 13: జిల్లా కేంద్రంలోని గిరిజన మహిళా గురుకుల డిగ్రీ కళాశాలలో ఖాళీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఉమాదేవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీఎస్, బీజెడ్సీ, ఎంజెడ్సీ, బీఏ, బీకామ్ గ్రూప్‌ల్లో చేరాలనే ఆసక్తి గల విద్యార్థినులు ఈనెల 18వ తేదీలోగా స్థానిక ఇందిరాగాంధీ స్టేడియం వద్ద గల కళాశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు. పూర్తి వివరాలకు 7901097706 నంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.